ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 16.04.2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం , పారిశ్రామిక, సాంకేతిక రంగాల్లో సహకారం పెంపొందించుకోవడమే లక్ష్యంగా ఈ రోజు నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్ లో పర్యటిస్తున్నారు.
2. ఒడిశాలోని నైనీ ప్రాంతంలో సింగరేణికి చెందిన కొత్త గనిలో బొగ్గు తవ్వకాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్చువల్‌గా ఈరోజు ప్రారంభిస్తారు.
3. భూభారతి చట్టం వల్ల భూములకు సంబంధించిన లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు.
4. రాష్ట్రంలో వచ్చే 24 గంటల్లో ఉరుములు , మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

-------------------

**ముఖ్యమంత్రి జపాన్ పర్యటన**

రాష్ట్రానికి పెట్టుబడులు  సాధించడానికి, పారిశ్రామిక,  సాంకేతిక రంగాల్లో సహకారం పెంపొందించుకోవడానికి   ఈరోజు నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్లో పర్యటిస్తున్నారు. 22వ తేదీ వరకు టోక్యో   , మౌంట్ ఫ్యూజీ , ఒసాకా, హిరోషిమా తదితర నగరాల్లో ముఖ్యమంత్రి పర్యటన కొనసాగుతుంది. జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం చర్చలు జరుపుతుంది. అలాగే జపాన్లో జరుగుతున్న   'ఒసాకా వరల్డ్ ఎక్స్ పో  – 2025' తెలంగాణ పెవిలియన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

**డెస్క్**

---------------------

**బొగ్గు తవ్వకాలు**

ఒడిశాలోని నైనీ ప్రాంతంలో కొత్త గని బొగ్గు తవ్వకాలను సింగరేణి సంస్థ ఈరోజు నుంచి ప్రారంభిస్తోంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వర్చువల్‌గా నైనీ గని తవ్వకాలను ప్రారంభిస్తారు. ఇప్పటి వరకూ తెలంగాణకే పరిమితమైన సింగరేణి సంస్థ కార్యకలాపాలు నేటి నుంచి ఇతర రాష్ట్రాల్లోనూ మొదలవుతాయి. ఈ గనిని 2016లోనే సింగరేణికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కేటాయించింది. అయితే తవ్వకాలను ప్రారంభించేందుకు ఇటీవలే అన్ని అనుమతులు మంజూరు కావడంతో ఈరోజు నుంచి కార్యకలాపాలను ఆరంభిస్తున్నారు. 38 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు తవ్వి తీయనున్నారు. నైనీ గని నుంచి మొత్తం 340 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు నిల్వలు తవ్వి తీయడానికి అవకాశం ఉంది.

**డెస్క్**

-----------------------

**భూభారతి**

భూభారతి చట్టం వల్ల భూములకు సంబంధించిన లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుందని, సులభతర సేవలు అందుతాయని వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి అన్నారు నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం పోల్కంపల్లి గ్రామంలో భూభారతి చట్టంపై ఈరోజు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ .... కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు , పేదల కోసం పథకాలు, చట్టాలను అమలు చేస్తోందన్నారు. ధరణిలో లోపాలను సవరించి రైతులకు మేలు చేయాలనే సంకల్పంతో భూభారతి తీసుకువచ్చామన్నారు.

పీటీసీ నాగర్ కర్నూల్

**భూభారతి**

భూభారతి పోర్టల్ ను, దాని చట్టాన్ని సమర్థంగా అమలు చేసేందుకుగాను ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో రేపటి నుంచి అవగాహన సదస్సులు ప్రారంభం కానున్నాయి. నారాయణ పేట జిల్లా మద్దూర్ , ఖమ్మం జిల్లా నేలకొండపల్లి , ములుగు జిల్లా వెంకటాపూర్ , కామారెడ్డి జిల్లా లింగంపేట మండలాలను ఈ పథకం ప్రయోగాత్మక అమలు కోసం ఎంపిక చేశారు.

డెస్క్/ PTC, SANGAREDDY

**పొన్నం ప్రభాకర్**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సోమారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈరోజు ప్రారంభించారు. సోమారం గ్రామంలో మొదటిసారి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. వేసవిలో మంచినీటి సమస్య రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం అధికారులకు ఆదేశాలు జారీ చేసారు.

పిటిసి, కరీంనగర్

**TELANGANA -ED RAIDS:**

మనీ లాండరింగ్ కేసులో సురానా గ్రూప్ , సాయి సూర్య డెవలపర్ సంస్థల కార్యాలయాల్లో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ - ఈడీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ , సికింద్రాబాద్ జంట నగరాల్లోని జూబ్లీ హిల్స్ , బోయిన్‌పల్లి ప్రాంతాల్లో రెండు గ్రూపుల ఆస్తులను ఈడీ వేర్వేరుగా సోదా చేస్తోంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం , ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేసి వినియోగదారులకు అందించడంలో సాయి సూర్య డెవలపర్స్ విఫలమైంది. ఈ నేపథ్యంలో ఈ సంస్థపై పలు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ సంస్థ అభివృద్ధి చేసిన గ్రీన్ మెడోస్ వెంచర్ మోసానికి సంబంధించి దాని యజమాని సతీష్ చంద్ర గుప్తాపై కేసు నమోదైంది. ఈ వెంచర్‌కు మహేష్ బాబు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు.

----MSL

**ఇందిరమ్మ ఇళ్లు**

హనుమకొండ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ఈరోజు ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన కలెక్టర్ మొదటి దశలో సొంత స్థలం ఉన్న అత్యంత నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేయాలని సూచించారు. ఇప్పటికే ప్రతి మండలంలోని ఒక గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మొదలైందని తెలిపారు.
పీటీసీ, వరంగల్

**వాతావరణం**

రాష్ట్రంలో వచ్చే 24 గంటల్లో ఉరుములు , మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కరీంనగర్ , పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి , ములుగు, భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ , రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి , వరంగల్ సహా ఇతర జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అదేవిధంగా వచ్చే 3 రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత లు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

కాగా వరంగల్ జిల్లాలో నిన్న రాత్రి ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా 17.9 మిల్లీమీటర్ల మోస్తరు వర్షపాతం నమోదైనట్టు జిల్లా ప్రణాళిక అధికారి వెల్లడించారు.

పీఎన్/ పిటిసి, వరంగల్

**ముద్ర రుణాలు**

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఔత్సాహికులకు ముద్రా రుణాలు అందిస్తున్నట్టు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ తెలిపారు. చిరు వ్యాపారస్తుల నుంచి పెద్ద వ్యాపారస్తుల వర కు ఈ ముద్రా రుణాలను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పథకానికి సంబంధించిన మరిన్ని వివరాలను ఆకాశవాణితో పంచుకుంటూ...

**సౌండ్ బైట్**

పిటిసి, నిర్మల్ జిల్లా

**వడగాలులు**

తెలంగాణ ప్రభుత్వం వడగాలులు , వడదెబ్బలను రాష్ట్ర విపత్తుగా ప్రకటించింది. దీని ప్రకారం వడదెబ్బ వల్ల మరణించిన వ్యక్తి కుటుంబానికి 4 లక్షల రూపాయల వరకు పరిహారం అందుతుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ కార్యదర్శి అరవింద్ కుమార్ ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేశారు. వృద్ధులు , పిల్లలు, నిర్మాణ రంగ కార్మికులు తదితరులపై వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోందని ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటి వరకు వడదెబ్బ వల్ల మరణించిన వారి కుటుంబాలకు 50 వేల రూపాయలు మాత్రమే అందేవి. కొత్తగా అమల్లోకి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం వార్షిక SDRF నిధుల్లో 10 శాతం బాధితులకు పరిహారం అందించేందుకు ఉపయోగించుకోవచ్చు.

**MSL**

**నీటి ఎద్దడి**

వరంగల్ జిల్లాలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణ అంశంపై ఈరోజు ఎంపీడీవోలు , నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. భూగర్భ జలాలు ఇంకిపోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నీటిపారుదల అధికారులకు సూచించారు. గతంలో నీటి ఎద్దడి ఎదుర్కొన్న ప్రాంతాల్లో సమస్య పునరావృతం కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**వరంగల్ జిల్లా పీటీ సీ**

**పోలీసు మీకోసం**

పోలీసు మీకోసం అనే కార్యక్రమంలో భాగంగా ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీసు సూపరింటెండెంట్ DV శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ జిల్లాలో పోలీసుల ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

పిటిసి, ఆసిఫాబాద్

**ఫిర్యాదుల పెట్టె**

చౌక ధరల దుకాణాలలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని , నోడల్ అధికారుల నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ శ్రీనివాసడ్డి అధికారులకు సూచించారు. జాతీయ ఆహార భద్రత చట్టం-2013 అమలు తీరుపై నిన్న సాయంత్రం నల్గొండ కలెక్టరేట్లో ఆహార కమిషన్ సమీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పాలు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిటిసి, నల్లగొండ జిల్లా

**వనపర్తి**

రాష్ట్రంలో రైతు ,మహిళా సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. ఈరోజు పెద్దమందడి మండలంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... మహిళా సంఘాలు స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

పీటీసీ, వనపర్తి జిల్లా